**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 261 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## ట్రంప్ బెదిరింపులు..

### 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరాన్‌కు చేరువలో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ( 37 ఏళ్ల సంప్రదాయానికి బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

- మిగతా2లో



## బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభం

### స్టార్మర్‌కు పదవీ గండం

### పార్టీ నేతల శరణు కోరిన ప్రధాని

### ఎప్‌స్టీన్ ఫైల్ల కలకలం

- మిగతా2లో



# కాలం చెల్లిన చట్టాలు రద్దు

**ఈ ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించింది. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎస్ఐపీబీల ద్వారా రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు ఆమోదించాం. దీంతో మరో 8.50 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయించాం. 95 కేంద్ర ప్రాయోజిత పథకాల్ని పునరుద్ధరించాం.సీఎం చంద్రబాబు**



- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే చర్యలు
- సాంకేతికతతో ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- తొలిసారి లాభాల బాటలో విశాఖ ఉక్కు
- బృందస్ఫూర్తిని మరింత సమర్థంగా చాటుకోవాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు

కాలం చెల్లిన చట్టాలు, నిబంధనలపై సమీక్షించి రద్దు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఓ కమిటీ వేసి అనవసర చట్టాలను తొలగిస్తోందని, దీనికి ఆంధ్రప్రదేశ్ మోడల్‌గా ఉండాలన్నారు. కొత్తగా కేంద్రం తీసుకొస్తున్న ఏఐ సావరిన్‌తో పాటు ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలు, సాంకేతికతలను అందిపుచ్చుకొని నిర్దిష్ట ప్రణాళికతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చేరామని, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పరిపాలనలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం ప్రారంభోపన్యాసం చేశారు. 'రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని, అన్ని వ్యవస్థలనూ గాడిలో పెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. 19 నెలలుగా అద్భుతంగా పనిచేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీల అమలు సహా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తున్నాం. నెలలో రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు, మూణ్నెల్లకోసారి కలెక్టర్ల సదస్సు విధిగా నిర్వహిస్తున్నాం. ఎస్ఐపీబీ, ఎస్ఐపీసీ నిర్వహించి పెట్టుబడుల ప్రతిపాదనల్ని ఆమోదిస్తున్నాం. జిల్లాల్లోనూ ఇన్‌ఛార్జ్ మంత్రులు, కలెక్టర్లు, కిందిస్థాయి సిబ్బంది వరకూ ఇదే బృందస్ఫూర్తితో పనిచేయాలి' అని సీఎం కర్తవ్యాన్ని గుర్తుచేశారు.'ప్రభుత్వ సమాచారమంతా సింగిల్ పోర్టల్‌లోకి తెచ్చాం. ఏఐ అప్లికేషన్‌ను వినియోగిస్తున్నాం. క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన చేయడం వల్ల క్వాంటమ్ కంప్యూటర్ ఉండే ఆరేడు దేశాల్లో ఇండియా ఒకటిగా మారనుంది.

- మిగతా2లో



# ఏఐని చూసి భయపడకండి

- దానిపై పట్టు సాధించండి..
- మొబైళ్లకు బానిసలుగా మారొద్దు
- 'పరీక్షా పే చర్చా'లో విద్యార్థులకు
- ప్రధాని మోదీ సూచన

ఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ను చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ సాంకేతికతతో నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. 'పరీక్షా పే చర్చా' రెండో ఎపిసోడ్‌లో భాగంగా సోమవారం ఆయన వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు.


- మిగతా2లో

## డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే




ఢిల్లీ: దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ముమ్మాటికీ 'భారీ చోరీలు/బందిపోటు దోపిడీలే'నని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి

- మిగతా2లో



# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం

- రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆగ్రహం
- 103 మంది సభ్యుల సంతకాల సేకరణ
- సభాపతితో విపక్ష నేత భేటీ..


ఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు సమాచారం. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో ఈ డిమాండును విపక్షాలు తెరపైకి తీసుకువస్తున్నాయి. రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో.. తృణమూల్, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొని ఈ నిర్ణయానికి వచ్చాయి. లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు దీనిని ఎప్పుడు సమర్పించాలో మంగళవారం నిర్ణయిస్తారు. పార్లమెంటు హౌస్‌లో భేటీ అయిన కాంగ్రెస్ నేతలు

- మిగతా2లో

## కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో పాలన

### బంగారు తెలంగాణ భాజపాతోనే సాధ్యం

### ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లు తెలంగాణ రాష్ట్రానికి పట్టిన రాహు కేతువులని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్, భారాస గ్రహణం నుంచి బయటపడి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుకోవాలంటే

- మిగతా2లో



### ఎయిర్‌పోర్టులో చంద్రబాబును

## మర్యాదపూర్వకంగా కలిసిన సచిన్

- ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు నాయుడు
- విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన క్రికెటర్ సచిన్ టెండూల్కర్
- ఇద్దరి మధ్య కాసేపు కొనసాగిన ఆత్మీయ సంభాషణ
- అంతకుముందు పార్టీ ఎంపీలతో లాంజ్‌లో సమావేశమైన ముఖ్యమంత్రి
- కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు రాజధానికి వెళ్లిన సీఎం

- మిగతా2లో

### అంబటి రాంబాబుకు

## రెండో షాక్...

### మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు

- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆందోళన
- ఆ సందర్భంగా పోలీసు విధులకు ఆటంకం కలిగించిన అంబటి
- 14 రోజుల రిమాండ్ విధించిన స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు

ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడిన కేసులో రిమాండ్ లో ఉన్న వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో షాక్ తగిలింది. మెడికల్ కాలేజీని పీపీపీ

- మిగతా2లో





## జగన్ పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు

- జగన్ హయాంలో నాణ్యత లేని లడ్డూలు తయారు చేశారన్న శ్రీనివాసానంద సరస్వతి
- లడ్డూని కల్తీ చేయడం దారుణమని వ్యాఖ్య
- జగన్ అండ్ కో క్షమాపణ చెప్పాలని డిమాండ్

- మిగతా2లో

# కాలం చెల్లిన చట్టాలు రద్దు

-మొదటిపేజీ తరువాయి

రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను అమరావతిలోనే తయారుచేసి ప్రపంచానికి అందించబోతున్నాం. ఏఐ, క్వాంటమ్ కంప్యూటర్లు, డేటా సెంటర్లు భవిష్యత్తులో సాంకేతికతంగా పెనుమార్పులు తెస్తాయి. రోజువారీ జీవితంలోనూ డీప్ టెక్నాలజీ వాడకం పెరుగుతుంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులోనూ ఏఐ ద్వారా ఆర్థిక వృద్ధి ఎలా సాధించవచ్చు, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వాడకం ప్రభావం ఎలా ఉంటుంది, వాటిని ఏయే దేశాలు ఎలా అందిపుచ్చుకుంటున్నాయో చర్చించార'ని చంద్రబాబు వివరించారు.

**ఆత్మహత్యలకు కారణాలపై ఆడిట్**

'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించాం. ఉద్యాన సాగును పూర్వోదయ లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద ప్రోత్సహిస్తాం. సాగునీటి వసతి పెంచి రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా మారుస్తాం. ఉద్యాన సాగు రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకురానున్నామ'ని చంద్రబాబు వివరించారు. 'వైకాపా ప్రభుత్వంలో సేద్యం దెబ్బతిని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. దీన్ని చక్కదిద్దుతున్నాం. రైతులు, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే, అందుకు కారణాలు ఆడిట్ చేయాలని ఆదేశించాం. తద్వారా ఆత్మహత్యల నివారణకు విధానపరమైన పరిష్కారాలు కనిపెట్టాల'ని సీఎం పేర్కొన్నారు. పొగాకు, మామిడి, కోకో, ఉల్లి, తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతుంటే, ప్రభుత్వం జోక్యం చేసుకుని రూ.1,100 కోట్లు అందించిందని, కోస్తాంధ్రలో మత్స్య, వాణిజ్య పంటల సాగును పెంచి, సత్ఫలితాలు సాధించిందని వివరించారు.

**గడువులోగా పోలవరం, అమరావతి**

అమరావతి శ్మశానమని, ఎడారి అని వైకాపా నాయకులు చేసిన విమర్శలు, విన్యాసాలన్నీ పటాపంచలై నేడు రాజధాని పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, మూడేళ్లలో అమరావతికి ఓ రూపాన్ని తీసుకొస్తామని సీఎం పేర్కొన్నారు. మోస్ట్ లివబుల్ సిటీగా మారే అమరావతి వంటి నగరాలు అవసరమని కేంద్రం చెప్పినట్లు సీఎం గుర్తుచేశారు. 'వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో కొట్టుకుపోయిన పోలవరం డయాఫ్రం వాల్‌ను రూ.వెయ్యి కోట్లతో మళ్లీ నిర్మిస్తున్నాం. ఇది మార్చిలో పూర్తవుతుంది. 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని సాకారం చేసి, జాతికి అంకితమిస్తామ'ని పునరుద్ఘాటించారు.

**సంపూర్ణంగా చెత్త తొలగింపు**

'వైకాపా హయాంలో గుంతల్లో, మైదానాల్లో చెత్త వేసి, వాటిని కాలుష్యమయం చేశారు. మేమొచ్చాక 105 లక్షల టన్నుల వ్యర్థాలను తొలగించాం. మార్చిలోగా 100 శాతం తొలగిస్తాం. రూ.1,000 కోట్లతో రోడ్లకు మరమ్మతులు చేశాం. మరో రూ.3 వేల కోట్ల నిధులిస్తాం. పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.4 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. కేంద్రం కొత్తగా తెచ్చిన జీరామ్‌జీ అమలు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పడే అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కొనేందుకు ఆస్తుల్ని సృష్టించే పనులు చేపడతాం. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని కొనసాగిస్తూ, రూ.25 వేల కోట్లతో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తామ'ని సీఎం పేర్కొన్నారు.

**గూగుల్‌దే అతిపెద్ద పెట్టుబడి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మొదటిసారిగా విశాఖ ఉక్కు పరిశ్రమ లాభాలబాట పట్టిందని, తాజాగా రూ.54 కోట్ల ఆదాయం వచ్చిందని సీఎం వెల్లడించారు. 'విశాఖ ఐటీ హబ్‌గా మారబోతోంది. అక్కడ గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టబోతోంది. దేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టాక వచ్చిన అతిపెద్ద పెట్టుబడి ఇదే. రాష్ట్రంలో 5 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయి. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమకు శంకుస్థాపన చేశామ'ని సీఎం వివరించారు.

# కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో పాలన

-మొదటిపేజీ తరువాయి

భాజపాకు అధికారం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలను కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం పుర ఎన్నికల ప్రచారం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ధనిక రాష్ట్రం తెలంగాణను భారాస అప్పులపాలయ్యేలా చేసింది. అప్పుల్లో ఉన్నా సరే రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలా అని కాంగ్రెస్ ఆలోచిస్తోంది. ఇదంతా చాలదన్నట్లు

ఆ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతలపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలో అర్థం లేదు. గత పన్నెండు సంవత్సరాల్లో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చింది. మేం ఇచ్చే నిధులతోనే ప్రస్తుతం తెలంగాణలో పాలన సాగుతోంది' అని రామచందర్‌రావు అన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే తెలంగాణ మొత్తం ప్రగతి సాధించినట్లు కాదని, గత బడ్జెట్‌లో నిజామాబాద్ జిల్లాకు ఏం కేటాయించారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సమావేశంలో నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్‌పటేల్ కులాచారి పాల్గొన్నారు.

**ప్రజలను రెచ్చగొట్టే మతతత్వ పార్టీ కాంగ్రెస్సే**

"గతంలో నిర్మల్ వచ్చిన ఓ ఎంఐఎం నేత.. పోలీసులు పక్కకు తప్పుకొని.. 15 నిమిషాలు సమయం ఇవ్వండి. మిగతాదంతా మేం చూసుకుంటాం.. అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్సే ముస్లిం, ముస్లిమే కాంగ్రెస్ అంటున్నారు. మతాలను రెచ్చగొట్టి, ప్రజల మధ్య విభేదాలు- విధ్వంసం సృష్టించాలనుకుంటున్నారు. కాంగ్రెస్సే నిజమైన మతతత్వ పార్టీ" అని రామచందర్‌రావు విమర్శించారు. పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్మల్ వచ్చిన ఆయన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. గతంలో భారాసతో పొత్తు పెట్టుకున్న మజ్లిస్, ఇప్పుడు కాంగ్రెస్ పంచన చేరిందని, ఆ రెండు పార్టీలకు మధ్యవర్తిగా మారిందని దుయ్యబట్టారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి బస్వపురం లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభం

లండన్: రాజకీయ అనిశ్చితికి మారుపేరైన బ్రిటన్‌లో మళ్లీ సంక్షోభం తలెత్తింది. లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్న పార్టీ సీనియర్ నేత మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించిన ప్రధాని కీర్ స్టార్మర్ పదవీ గండాన్ని ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన పార్టీ ఎంపీల శరణు కోరారు. ప్రధానిగా స్టార్మర్ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నరే అయింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం వెలుగులోకి రాగానే మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించినా స్టార్మర్‌పై విమర్శల దాడి ఆగలేదు. ఆదివారం ప్రధాని చీఫ్ ఆఫ్ స్టాఫ్ మోర్గాన్ మెక్ స్వీనీ రాజీనామా చేసినా, బాధ్యతంతా తనదేనని అంగీకరించినా ముప్పు తొలగిపోలేదు. క్రమంగా ఆయన లేబర్ పార్టీ ఎంపీల మద్దతును కోల్పోతున్నారు. దీంతో ఆయన ఎంపీలతో రహస్యంగా సమావేశమవుతున్నారు. మాండెల్సన్‌ను అమెరికా రాయబారిగా నియమించినందుకు గత వారం స్టార్మర్ క్షమాపణలు చెప్పారు. తాను అతడి అబద్ధాలను నమ్మానని ఆవేదన వ్యక్తం చేశారు. మాండెల్సన్ నియామకానికి సంబంధించిన పత్రాలను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై ఆయన అబద్ధాలు చెప్పారనే ఆరోపణలొస్తున్నాయి.

**పోలీసుల దర్యాప్తు**

15 ఏళ్ల కిందట సున్నితమైన ప్రభుత్వ సమాచారాన్ని ఎప్‌స్టీన్ అందజేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాండెల్సన్‌పై పోలీసు దర్యాప్తు జరుగుతోంది. ఇది నిరూపితమైతే ఆయనకు జీవిత ఖైదు పడే అవకాశముంది. అయితే మాండెల్సన్‌పై ఎటువంటి లైంగిక దాడుల ఆరోపణలు రాలేదు. దీంతో ఆయనను అరెస్టు చేయలేదు. అభియోగాలను మోపలేదు.

**ప్రకంపనలతో స్వీనీ రాజీనామా**

2020లో లేబర్ పార్టీ నేతగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్టార్మర్‌కు అత్యంత సన్నిహిత సహచరుడిగా మెక్ స్వీనీ ఉన్నారు. 2024 జులైలో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఘన విజయంలో ఆయన పాత్ర ఎంతో ఉంది. ఆ తర్వాత ఆయన తీసుకున్న తప్పుడు నిర్ణయాలవల్ల పార్టీ ప్రతిష్ఠ మసకబారింది.

**ప్రధానికి కొంత సమయం!**

మెక్ స్వీనీ రాజీనామా చేయడంతో ప్రధాని స్టార్మర్‌కు కొంత సమయం లభించవచ్చని లేబర్ పార్టీ నాయకులు కొందరు చెబుతున్నారు. ఈలోగా ఆయన పార్టీ నేతల్లో విశ్వాసాన్ని ప్రోది చేసుకునే అవకాశముందని అభిప్రాయపడ్డారు. మెక్ స్వీనీ విభజన రాజకీయాలు చేసేవారని, ఆయన వైదొలగడంతో పార్టీని మళ్లీ గాడిలో పెట్టడానికి అవకాశం లభించిందని సీనియర్ చట్టసభ సభ్యులు ఎమిలీ థార్న్‌బెర్రీ పేర్కొన్నారు. స్టార్మర్ మంచి నేతేనని, ఆయన బలమైన, స్పష్టత కలిగిన నాయకుడని ఆమె తెలిపారు. స్వీనీ రాజీనామాతో స్టార్మర్ బలహీనపడతారని మరికొంత మంది నేతలు అభిప్రాయపడుతున్నారు.

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం

-మొదటిపేజీ తరువాయి

మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, జైరాం రమేశ్,
శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ తదితరులు

**..వీటిపై మాట్లాడనివ్వండి**

రాహుల్, మరికొందరు విపక్ష ఎంపీలు సోమవారం ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో ప్రతిష్టంభన తొలగింపుపై చర్చించారు. రాహుల్ తాను లేవనెత్తదలచిన అంశాలను వివరించారు. వాటిపై మాట్లాడనిస్తే చర్చకు సిద్ధమేనని చెప్పారు. రాహుల్ వెంట వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టి.ఆర్.బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. వారు వేర్వేరు అంశాలను లేవనెత్తారు. ప్రభుత్వంతో మాట్లాడి చెబుతానని స్పీకర్ వారికి తెలిపారు. రాహుల్ ఒక్కరే మాట్లాడి మిగిలినవారికి అవకాశం కల్పించకపోతే కుదరదని ప్రభుత్వం పేర్కొంటోంది. ఎంపీల నుంచి ప్రధానికి ముప్పు ఉన్నట్లయితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ విలేకరులకు చెప్పారు. తాను సభలో ఏం చెబుతానోననే భయంలో ప్రధాని ఉన్నారని, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. నరవణె పుస్తకాన్ని తాను ఇస్తానని మోదీ భయపడిపోతున్నారని చెప్పారు.

**'స్పీకర్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు'**

స్పీకర్‌పై అధికారపార్టీ ఒత్తిడి ఉందని, ఆయన సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆరోపించారు. ఆయనను ఉద్దేశించి ఈ మేరకు లేఖ రాశారు. "సభకు ప్రధాని మోదీ గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, మీరు అధికార పార్టీ ఒత్తిడి మేరకు మాపై నిరాధార ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా మీరు వ్యవహరించాలి" అని వారు ఓం బిర్లాను కోరారు. లేఖపై ప్రియాంకా గాంధీ సహా పలువురు సంతకాలు చేశారు.

ఆ పదవిపై గౌరవం ఉంది

# ఎయిర్‌పోర్టులో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సచిన్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులతో సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబును క్రికెట్ దిగ్గజం, భారతరత్న సచిన్ టెండూల్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ విమానాశ్రయంలో వీరిద్దరి మధ్య ఈ భేటీ జరిగింది. వివరాల్లోకి వెళితే, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేపట్టారు. ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు పార్టీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం, ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో ఎంపీలతో కలిసి ఆయన కొద్దిసేపు సమావేశమయ్యారు. అదే సమయంలో విమానాశ్రయంలో ఉన్న సచిన్ టెండూల్కర్.. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అక్కడే ఉన్నారని తెలుసుకున్నారు. వెంటనే ఆయన వద్దకు వచ్చి మర్యాదపూర్వకంగా పలకరించారు. ఇద్దరు ప్రముఖులు కాసేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇది పూర్తిగా ఊహించని, మర్యాదపూర్వక భేటీ అని తెలుస్తోంది. ఎంపీలతో సమావేశం, సచిన్‌తో సంభాషణ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలోని 1 జన్ పథ్‌లో ఉన్న తన అధికారిక నివాసానికి బయలుదేరి వెళ్లారు. తన పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

# జగన్ పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు

వైసీపీ అధినేత జగన్ పై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూని కల్తీ చేశారని ఆరోపించారు. జగన్ హయాంలో నాణ్యత లేని లడ్డూలు తయారు చేశారని... ఇది అన్యమతస్తుల కుట్ర అని మండిపడ్డారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూని కల్తీ చేయడం దారుణమని అన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని తొలుత కూటమి నేతలు మాట్లాడినప్పుడు తాము పట్టించుకోలేదని... కానీ, ఇప్పుడు లడ్డూ కల్తీ జరిగిందని సీబీఐ రిపోర్ట్ ఇచ్చిందని, ఈ రిపోర్టుతో తాము భయాందోళనకు గురయ్యామని చెప్పారు. లవ్ జిహాద్ మాదిరి లడ్డూ జిహాద్ జరిగిందనే అనుమానం తమకు ఉందని అన్నారు. రసాయనాలు కలిసిన లడ్డూ తిని భక్తులు అనారోగ్యంపాలయ్యే అవకాశం ఉందని చెప్పారు. సీబీఐ రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని అన్నారు. రెండు కొండలు అన్న వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎలాంటి శిక్ష పడిందో అందరూ చూశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లడ్డూ కల్తీపై నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే జగన్ అండ్ కో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అంబటి రాంబాబుకు రెండో షాక్...

-మొదటిపేజీ తరువాయి

విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళన కార్యక్రమం సందర్భంగా... బ్యారికేడ్లను తోసివేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో ఆయనకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు, చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గుంటూరు మొబైల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

# డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే

-మొదటిపేజీ తరువాయి

ఒక పకడ్బందీ 'ప్రామాణిక నిర్వహణ విధానం' (ఎస్ఓపీ) రూపొందించాలని సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. డిజిటల్ అరెస్టు మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో కుమ్మక్కు కావడం వల్ల జరుగుతుండొచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు మధ్య మన దేశంలో రూ.52వేల కోట్లకు పైగా సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ ..'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

# ట్రంప్ బెదిరింపులు..

## 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్..

-మొదటిపేజీ తరువాయి

ఫిబ్రవరి 8న ఎయిర్‌ఫోర్స్ కమాండర్లతో ఏటా ఆయన భేటీ అవుతుంటారు. ఈసారి ఆ సమావేశంలో ఆయన పాల్గొనలేదని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 1989లో సుప్రీంలీడర్‌గా బాధ్యతలు అందుకున్న దగ్గరినుంచి చివరకు కరోనా సమయంలో కూడా ఈ వార్షిక సమావేశాన్ని ఆయన మిస్ చేయకపోవడం గమనార్హం. 1979లో ఫిబ్రవరి 8న పహ్లవీ పాలకులకు వ్యతిరేకంగా రుహోల్లా ఖొమేనీకి వాయుసేన అధికారులు విధేయత ప్రకటించారు. దాంతో గత నాలుగు దశాబ్దాలుగా ఆ రోజుకు గుర్తుగా ఎయిర్‌ఫోర్స్ అధికారులు సుప్రీం లీడర్‌తో సమావేశం అవుతుంటారు. ఇదిలాఉంటే.. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపులు పెంచుతోంది. ఆ దేశం వైపు తమ నౌకాదళం కదులుతోందని, అది అక్కడికి చేరుకున్న తర్వాత ఎలా పనిచేస్తుందో చూద్దామంటూ ట్రంప్ హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఒకవైపు రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండగా.. మరోవైపు ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# ఏఐని చూసి భయపడకండి

-మొదటిపేజీ తరువాయి

"కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు వచ్చినప్పుడు ఏదో జరగనుందన్న చర్చ జరిగింది. ఇలాంటి భయాలు వీడండి. కొందరు చిన్నారులు మొబైళ్లకు బానిసలుగా మారుతున్నారు. స్మార్ట్‌ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. సాంకేతికతను నైపుణ్యాలు పెంచుకోవడానికి వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పారు.

**మంచి నాయకుడి లక్షణాలేంటి?**

మోదీ: నాయకుడిగా ఎదగాలంటే ఎవరూ సాహసించని పనులు చేయాలి. నాయకుడు అంటే ఎన్నికల్లో పోటీ చేయడం, పార్టీలు పెట్టడం కాదు. మీ అభిప్రాయాలను పదిమందికి అర్థమయ్యేలా చెప్పగలగాలి.

**స్టార్టప్ ఎలా ప్రారంభించాలి?**

స్టార్టప్‌నకు వయసుతో సంబంధం లేదు. విద్యార్థి దశలోనూ ప్రారంభించొచ్చు. ఇందుకోసం మీరు ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయండి. పారిశ్రామికవేత్తలను కలవండి. మీ ఆలోచనలు వారితో పంచుకోండి. ఆ ప్రయాణంలో మీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. అవి మీకు ఉపయోగపడతాయి.

**పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?**

మంచి విద్యార్థిగా మారాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించాలి. గొప్ప క్రీడాకారుడు నిరంతరం సాధన చేస్తాడు. పడతాడు.. లేస్తాడు.. విజయం సాధిస్తాడు. చదువూ అంతే. సాధన కీలకం.

**క్రమశిక్షణ, ప్రేరణ.. ఏది ముఖ్యం?**

రెండూ ముఖ్యమే. క్రమశిక్షణ లేకపోతే స్ఫూర్తి ఎంత ఉన్నా ఫలితం శూన్యం.

# లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా శిక్ష తప్పదు యార్లగడ్డ





**తిరుపతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:**సినీ నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన 'సంకల్ప యాత్ర' సోమవారం నాటికి తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బండ్ల గణేష్ రాత్రి కి అలిపిరిలో బస చేసి, మంగళవారం ఉదయం మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించు కోనున్నారు. ఆ పై తన యాత్రను ముగిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ టీటీడీ లడ్డూ కల్తీ అంశం పై సంచలన వ్యాఖ్యలు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా కూటమి ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం లోని పెద్దలకు తెలియకుండా ఇలాంటి కల్తీ జరిగే అవకాశం లేదని ఆరోపించారు. అప్పటి టీటీడీ బోర్డు కూడా దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. వంద కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆవులు బంగ్లాదేశ్‌కు తరలిపోయాయని సంచలన ఆరోపణలు చేశారు. టీటీడీకి అవసర మైన నెయ్యి కోసం తగినన్ని ఆవులను వృద్ధి చేయాలని ఆయన సూచించారు. వైసిపి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నప్పటికీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారు డైవర్ట్ అవ్వరని పేర్కొన్నారు. అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి ఆస్తుల పై కూడా విచారణ జరపాలని ఒక భక్తుడిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, అక్కడ కేవలం హిందువులే ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాగే వైసిపి నాయకులకు తెలుగు భాష నేర్పించాలని, బూతులు మాట్లాడే వారిని జైల్లో పెట్టేలా చట్టాలు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు.

# గురుకుల ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన సుందరపు





**మునగపాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:** మండలం లోని పాటిపల్లి గ్రామంలో కస్తూరిబాయ గురుకుల ప్రభుత్వ పాఠశాలలను శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ తనిఖీ చేశారు. సోమవారం ఈ తనిఖీలో విజయ్ కుమార్ విద్యార్థు లకు ప్రేరణాత్మక సందేశం, సమాజం పై అవగాహన, పరీక్షలు రాయడంలో మెళుకువలు, చేతి దస్తూరి పై అవగాహన కల్పించిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. తరగతి గదిలో ఉపాధ్యాయులు స్థానంలో విద్యార్థులతో వారు చదివే విధానాన్ని, ప్రతీ సబ్జెక్ట్ పై వారికున్న జ్ఞానాన్ని, పట్టుని మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పటి నుండే సమాజం, దేశం, తమ భవిష్యత్ పై బాధ్యతలను అలవరుచు కోవాలన్నారు. ముఖ్యంగా తరగతి గదిలో కూర్చున్నప్పటి నుంచి టీచర్లు చెప్పే పాఠాలు, సామజిక అంశాల పై ప్రశ్నలు తయారుచేసుకుని, టీచర్లతో వాటికి సమాధానాలను తెలుసుకుని చర్చించాలన్నారు.


అదే విధంగా ప్రతీ విద్యార్థి చేతి దస్తూరిని వృద్ధి పరిచుకోవాలని, చేతి దస్తూరి బాగున్నట్లైతే పరీక్షలలో మరిన్ని మార్కులు సాధించవచ్చని తెలిపారు. 10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు తొందరలో పరీక్షలు సమీపిస్తున్నందున వాటికి సంశీలు లై ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశిలించి, విద్యార్థులతో నాణ్యమైన ఆహారాన్ని మెనూకు తగ్గట్టుగా ఇవ్వాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ఎమ్.ఈ.ఓ లు,ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కూటమి విజయం పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి శుభారంభం






**పెందుర్తు, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:**గత 15 రోజుల క్రితం పెందుర్తి ఎంపీపీ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం ఫలించి కూటమికి ఎంపీపీ పదవి దక్కేందుకు మార్గం సుగమం అయింది. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో సమక్షంలో తమ మద్దతు ఎంపీటీసీ లతో కలిసి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తమ బలాన్ని నిరూపించుకున్నారు. మొత్తం తొమ్మిది ఎంపీటీసీ లకు గాను ఏడుగురు సభ్యులు ప్రస్తుత ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం పెట్టి గెలిచారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ అభివృద్ధికి సహకరించమని కోరిన ప్రజల అవసరాలు పక్కన పెట్టి రాజకీయాలు చేయాలని చూసినా వైసిపి పార్టీకి బుద్ధి చెప్పాలని ఉద్దేశంతో మాత్రమే ఎంపీపీ పై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టామని పంచకర్ల రమేష్ బాబు అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గం మొత్తం అభివృద్ధి చేయాలని ఒకే ఒక లక్ష్యంతో తప్ప ఏ పార్టీ సర్పంచ్ ఉన్నాడు, ఏ పార్టీ ఎంపీటీసీ ఉన్నాడు అనేది ఎప్పుడూ చూడలేదని, దానిని గ్రహించి తాము గెలిచిన పార్టీ అభివృద్ధికి సహకరించడం లేదు మీతో కలిసి వచ్చి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలని వైసీపీ నుంచి గెలిచిన ఎంపీటీసీలు కలవడంతో ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని, దానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

వారి సహకారంతో పెందుర్తి మండలంలో అన్ని పంచాయితీల్లో జిల్లా పరిషత్ నిధులు గాని, ఎన్ఆర్జిఎస్ నిధులు నుండి గాని, పంచాయతీ నిధుల నుండి గాని ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం ఆగకుండా పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూటమి లోని ప్రతి నాయకుడికి, కార్యకర్తలకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ యొక్క కార్యక్రమంలో నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి పాల్గొని ఈ యొక్క విజయానికి సహకరించిన ఎంపిటిసి లకు , నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు పెందుర్తి మండలం మండల పార్టీ అధ్యక్షులు జీవీఎంసీ వార్డు అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్ లు తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు.



తిరుమల, పెన్ సత్తా, ఫిబ్రవరి 09: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరి పై ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. తనను గెలిపించిన గన్నవరం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కలగాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసర మైన శక్తిని, దీవెనలను ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నారు.

# జివిఎంసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 95 వినతులు.

- జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 95 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరం లో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, పి.నల్లనయ్య లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 95 అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను, ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీల పై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ పి వి సత్యనారాయణ రాజు, వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి వాసుదేవ రెడ్డి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, డీసీపీ లు, ఏసీపీ లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, యు సి డి ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. ప్రసన్న వాణి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శాంతి కుమారి, రీజనల్ ఫైర్ ఆఫీసర్ కృపావరం, ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసి నాయుడు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలం దేవస్థానం అభివృద్ధి, చందనోత్సవ ఏర్పాట్ల పై సమీక్ష.



**సింహాచలం, పెన్ సత్తా, పిబ్రవరి 09:**సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అభివృద్ధి పనులు, ఏప్రిల్ 20 న జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక మైన 'చందనోత్సవం' ఏర్పాట్ల పై ఆలయ ఉద్యోగులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, సహాయ కార్యనిర్వహణా అధికారులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో తొలుత ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు.

అభివృద్ధి పనులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువు లోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 న జరిగే చందనోత్సవానికి లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం క్యూ లైన్ల ఏర్పాటు, చలవ పందిళ్లు, తాత్కాలిక షెడ్ల నిర్మాణం పై సుదీర్ఘంగా చర్చించారు. భక్తులకు ఎండ, వాన తగలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల (సెక్షన్ల) అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదం పంపిణీలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, విద్యుదీకరణ, భద్రత, రవాణా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై దిశానిర్దేశం చేశారు. ఉత్సవ సమయంలో అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా సేవలందించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఆలయ సహాయ కార్యనిర్వహణా అధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర ఆలయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవవైవిధ్య పరిరక్షణ కోసం గ్రీన్ సోల్జర్స్ కృషి అవసరం

- ప్రతి విద్యార్థి గ్రీన్ సోల్జర్ కావాలి.
- అడవుల పరిరక్షణ మానవాళి బాధ్యత
- ఏ జీవి అంతరించిన నష్టం మానవాళి కే
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం





**విశాఖపట్నం, పెన్ సత్తా, పిబ్రవరి 09:**జీవవైవిధ్య పరి రక్షణ కోసం గ్రీన్ సోల్జర్స్ కృషి అవసరం అని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నం జిల్లా ఎంవిపి కాలనీ లోని సమత డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ సరాబంది అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ జీవవైవిధ్య పరిరక్షణ కోసం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ హరిత సైనికులు గా (గ్రీన్ సోల్జర్స్) గా మారి అడవులు పరి రక్షణకు, సమస్త జీవుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అడవుల పరి రక్షణ మానవాళి బాధ్యత అన్నారు. ఏ జీవి అంతరించిన నష్టం మానవాళి కే అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలి అని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సరాబంది మాట్లాడుతూ పర్యావరణ, జీవావరణ పరి రక్షణ కోసం నిరంతరం తమ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతోంది అన్నారు. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, మనం జీవిస్తున్న ఈ భూగోళం, సమస్త జీవరాశి ఆరోగ్యంగా ఉండాలంటే మానవాళి కృషి చాలా అవసరం అన్నారు. ఏ జీవి అంతరించినా మానవాళికి మనుగడే నష్టం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శిల్ప, లెక్చరర్ డాక్టర్ శ్రీదేవి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బి రాజేష్ కుమార్, రామకృష్ణ, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- టెక్నాలజీ వినియోగం పై సూచనలు చేసిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి.
- ఇంటర్నెట్ సురక్షిత దినోత్సవాన్ని పురస్కరించు కొని అవగాహన సదస్సు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:** సైబర్ నేరాల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి సూచించారు. ఫిబ్రవరి 10, ఇంటర్నెట్ సురక్షిత దినోత్సవాన్ని పురస్కరించు కొని కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నిర్వహించిన ప్రాథమిక అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డిజిటల్ భద్రత పై కీలక అంశాలను వివరించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంలో జాగ్రత్త అవసరమని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, వీడియోలను నిర్లక్ష్యంగా అప్‌లోడ్ చేయకూడదని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ చెల్లింపుల సమయంలో ఫేక్ లింకులు, నకిలీ వెబ్ సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఫిషింగ్, ఓటీపీ మోసాలు, బ్యాంకింగ్ లాగిన్ ఫ్రాడ్, డీప్‌ఫేక్ ఏఐ వాయిస్ స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు వంటి సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద లింకులను క్లిక్ చేయరాదని, వ్యక్తిగత డేటాను ఎవరికీ పంచుకోరాదని హెచ్చరించారు. మాల్వేర్, స్పైవేర్ వంటి హానికర సాఫ్ట్‌వేర్‌ల వల్ల ఆర్థిక నష్టాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలి లేదా ఎఎవతీఎతీఱవ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. డిజిటల్ యుగంలో భద్రతతో కూడిన ఇంటర్నెట్ వినియోగమే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. మంగళవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సురక్షిత దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. ఎన్.ఐ.సి. అధికారి పాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.







# భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రత్నాకర్



**అనకాపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి 09:**జివిఎంసి హైస్కూల్ లో అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ విగ్రహాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు వారి యొక్క జీవిత చరిత్రలను తెలుసుకొని నిరంతరం స్ఫూర్తిని పొందుతారని అన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో భగత్ సింగ్ తన ధైర్య సాహసాలతో బ్రిటిష్ పాలకులకు ఎదురెళ్లి బ్రిటిష్ వారిని గడగడలాడించారని అన్నారు. అంతటి ధైర్య సాహసాలను ప్రతి విద్యార్థి అలవర్చుకుని విద్యలో, ఆటలలో రాణించి దేశానికి పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాలలో భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆల ప్రవీణ్ కుమార్ ని, సంఘ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత తాలాడ రాంబాబు జ్యూ,, భార్య నారాయణమ్మ, కుమారులు తాలాడ కిరణ్, దివాకర్, ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బ్రహ్మాజీ, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతా లక్ష్మణరావు, భాష, డీవీఎంసీ మాజీ మెంబర్ రేభాక మధుబాబు, పసగాడా నాగేంద్ర, ఆడారి పవన్, యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, ఓయ్ బోయిన వెంకటేష్, మొల్లి రమణబాబు, కోటిపల్లి శ్రీను, రేపాక ఇంద్ర కుమార్, దాసరి సంతోష్, వానపల్లి నాగేష్, అబ్దుల్ కలాం సేవా సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్, ఉపాధ్యాయులు, కాలేజ్ విద్యార్థులు, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.





- భూసంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- పి జిఆర్.ఎస్ కు-131, రెవెన్యూ క్లినిక్ కు- 197 అర్జీలు.
- డి.ఆర్వో వై.సత్యన్నారాయణ రావు.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి, 09:** భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని. పి జి ఆర్ ఎస్ కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం-1 , 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమలలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ, ఎన్ ఎ ఓ బి, బి జె యు ఆర్ ఎస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు రామమణి లు జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదే విధంగా డివిజను, మండల, గ్రామ స్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించాల ని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్ లో 131 మరియు రెవిన్యూ క్లినిక్ లో 197 అర్జీలు మొత్తం 328 అర్జీలు స్వీకరించడం జరిగిందని డి. అర్వో తెలిపారు.

కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, బి జె ఆర్ ఎస్, ఎన్ ఎ ఓ బి, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, మనోరమ, రామ మాణి, మెప్మా, ఐ సి డి ఎస్, కె సరోజినీ, సూర్య లక్ష్మి, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుదీర్, జిల్లా రవాణా శాఖ అధికారి జి మనోహర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# విషాదం నుంచి విజయం వైపు





**ప్రకృతి సేద్యంతో రైతు జ్యోతి అద్భుత ప్రస్థానం.**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 09:** అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, సంతపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి జ్యోతి ప్రకృతి వ్యవసాయంలో వినూత్న వ్యవసాయ పద్ధతులను అవలంబించి విజయం సాధించింది. జ్యోతి ప్రతిభను గుర్తించిన రైతు సాధికార సంస్థ (ఆర్వైఎస్ ఎస్), ఆమె అనుభవాలను అంతర్జాతీయ స్థాయిలో పంచుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా యూరప్ దేశాలతో పాటు మొత్తం 7 దేశాల్లో తన అనుభవాల ద్వారా రైతులకు దిశానిర్దేశం చేయడానికి ఆదర్శరైతు జ్యోతి ని ఎంపిక చేయడం జరిగిందని రైతు సాధికార సంస్థ, గుంటూరు, ఎగ్జిక్యూటివ్ వైస్ చెర్మన్, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు పి. విజయ్ కుమార్ తెలిపారు. ఆరోగ్యమే ఆయుధంగా మార్చుకున్న ఆదర్శ మహిళా రైతు

ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి జిల్లా సంతపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి జ్యోతి ప్రస్థానం ఎందరో యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. చదువు ముగించుకుని విజయవాడలో సిన్నెట్ టెక్నాలజీ అను సాఫ్ట్ వేర్ కంపెనీలో హెచ్ఆర్ ప్రొఫెషనల్ గా స్థిరపడిన ఆమె, గర్భధారణ సమయంలో ఆరోగ్య కారణాల దృష్ట్యా తిరిగి తన గ్రామానికి చేరుకోవాల్సి వచ్చింది. గర్భవతిగా ఉన్న సమయంలో తన బిడ్డ సరైన బరువు పెరగకపోవడంతో, మనం తినే ఆహారం లోని నాణ్యత, పోషకాల గురించి ఆమె తీవ్రంగా ఆలోచించారు. రసాయనాలతో పండించే పంటల వల్ల కలిగే నష్టాలను గమనించి, తన కుటుంబానికి ఆరోగ్యకర మైన ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో రసాయన రహిత వ్యవసాయం వైపు అడుగులు వేశారు. మొదట్లో దిగుబడి తగ్గుతుందేమోనన్న భయంతో తన మామగారు అడ్డు చెప్పినప్పటికీ, రైతు సాధికార సంస్థ వారి అద్వర్యంలో సంతపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సుల ద్వారా ఆమె ప్రకృతి వ్యవసాయం పై గట్టి నమ్మకాన్ని పెంచుకున్నారు. పట్టుదల తోడై రైతు శాస్త్రవేత్తగా సరికొత్త అవతారం

ఆమె తన వ్యవసాయాన్ని కేవలం ఒక అలవాటుగా కాకుండా, ఒక విజ్ఞాన శాస్త్రంగా భావించారు. 2020 లో కేవలం 0.10 ఎకరంలో ప్రారంభించిన ప్రయోగం, నేడు ఆమెను ఒక రైతు శాస్త్రవేత్త గా నిలబెట్టింది. ఆగస్టు 2024 లో ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీలో మెంటార్ గా బాధ్యతలు చేపట్టారు ఆమె, తన పొలాన్ని ఒక అభ్యాస ప్రయోగశాలగా మార్చుకున్నారు. ప్రతి పెట్టుబడిని, సాగు ఖర్చును, నేల ఆరోగ్యాన్ని నిశితంగా రికార్డు చేస్తూ, ప్రకృతి వనరు లైన జీవామృతం, బీజామృతం, మల్చింగ్ పద్ధతులను సమర్థవంతంగా అమలు చేశారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో పురుగుల ఉధృతి తగ్గడమే కాకుండా, నేల సారం కూడా గణనీయంగా పెరిగింది. ఆదాయం సాగులో అద్భుత విజయాలు ప్రకృతి వ్యవసాయం జ్యోతి కుటుంబ ఆర్థిక పరిస్థితిని సమూలంగా మార్చి వేసింది. ఒకప్పుడు అనిశ్చిత మైన లాభాలతో ఉన్న వారి వ్యవసాయం, ఇప్పుడు స్థిరమైన, లాభదాయక మైన వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఆమె వార్షిక ఆదాయం గతంలో 63,700 ఉండగా, ఇప్పుడు అది 2,00,540 కి పెరిగింది. ఆశ్చర్యకరంగా సాగు ఖర్చులు 42 శాతం నుంచి 12 శాతానికి పడిపోయాయి. నీటి పొదుపు విషయం లోనూ ఆమె విజయం సాధించారు. గతంలో 40 సార్లు తడులు అందించాల్సి రాగా, భూసారం మెరుగుపడటం వల్ల ఇప్పుడు కేవలం 15 సార్లు మాత్రమే అవసరమవుతోంది. కేవలం ఒకే రకమైన పంటకు పరిమితం కాకుండా, 42 రకాలకు పైగా పంటలను పండిస్తూ వైవిధ్యాన్ని చాటారు.

వినూత్న నమూనాలతో సుస్థిర ఆర్థిక ప్రగతి ఆమె అనుసరించిన ఏ గ్రేడ్ ఏటీఎం నమూనాలు ఆమె విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఒక ఎకరంలో కొబ్బరిని ప్రధాన పంటగా పండించారు. బొప్పాయి, అరటి, నిమ్మ, మామిడి, జామ వంటి పండ్ల పంటలతో పాటు, వంకాయ, మిరప, టమోటా, బీన్స్, బెండ , అలచంద, మొక్కజొన్న, బంతి పువ్వు వంటి కూరగాయల కోసం ఒక ప్రత్యేక బ్లాక్ లలో పంటలు పండిస్తూ భూమిని విస్తృతంగా వినియోగించుకున్నారు. అలాగే 0.20 ఎకరంలో 'ఎనీ టైమ్ మనీ' నమూనా ద్వారా నిరంతరం ఆదాయాన్నిచ్చే 25 రకాల ఆకు కూరలు, కూరగాయలు, దుంపలను సాగు చేస్తూ కుటుంబ పోషణకు ఎటువంటి లోటు లేకుండా చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం నా నేలను పునరుజ్జీవింప జేయడమే కాకుండా, నాకు ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చింది అని జ్యోతి సగర్వంగా చెబుతున్నారు. నేడు ఆమె తన అనుభవాలను తోటి రైతులతో పంచుకుంటూ గ్రామాల్లో మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు.

బొబ్బిలి జ్యోతి కృషి కేవలం అనకాపల్లి జిల్లా సంతపల్లికి మాత్రమే పరిమితం కాలేదు. ఆమె అవలంబిస్తున్న వినూత్న వ్యవసాయ పద్ధతులను గుర్తించిన రైతు సాధికార సంస్థ, ఆమె అనుభవాలను అంతర్జాతీయ స్థాయిలో పంచు కోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా యూరప్ దేశాలతో పాటు మొత్తం 7 దేశాల్లో తనఅనుభవాలను ద్వారా రైతులకు దిశానిర్దేశం చేయడానికి జ్యోతి ఎంపిక కావడం మనందరికీ గర్వకారణమని ఆయన తెలిపారు.





# అండర్ - 9 ఓపెన్, గర్ల్స్ చెస్ సెలక్షన్స్.





**విశాఖ డిస్ట్రిక్ట్ ఓపెన్ చెస్ టాలెంట్ హంట్ ఛాంపియన్, శ్యామ్ భార్గవ్.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, పిబ్రవరి 09:** జిల్లా అండర్ -9 ఓపెన్ & గర్ల్స్ చెస్ సెలక్షన్స్- 2026, విశాఖ డిస్ట్రిక్ట్ ఓపెన్ చెస్ టాలెంట్ హంట్ టోర్నమెంట్, కాస్మోస్ ప్రైమరీ స్కూల్, పెందుర్తి వేదికగా, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణి చెస్ అకాడమీ ద్వారా నిర్వహించబడింది. ఈ పోటీలో గెలిచిన మొదటి రెండు స్థానాల్లో ఓపెన్ & గర్ల్స్ ఏపి స్టేట్ అండర్ - 9 ఓపెన్ & గర్ల్స్ చెస్ చాంపియన్షిప్ విశాఖ జిల్లా నుంచి అర్హత సాధించి రాష్ట్రంలో చదరంగం ఆడుటకు ప్రాతినిధ్యం వహిస్తారు. విశాఖ డిస్ట్రిక్ట్ ఓపెన్ హంట్ చెస్ ఛాంపియన్ టోర్నమెంట్ కాస్మోస్ ప్రైమరీ స్కూల్ పెందుర్తి వేదికగా ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణి చెస్ అకాడమీ ద్వారా నిర్వహించబడింది. వివిధ కేటగిరిలో ఈ ఓపెన్ చెస్ విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యమానికి అతిథులుగా తేజస్వి ద్విభాష్యం డిప్యూటీ ప్రిన్సిపాల్, కాస్మాస్ ప్రైమరీ స్కూల్ డాక్టర్ కనకాల శిరీష, కామేష్ మెంబర్ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఎస్. కమలేశ్వరరావు, డైరెక్టర్ మణి చెస్ అకాడమీ ఎస్. మణికంఠ రావు, టోర్నమెంట్ డైరెక్టర్ అండ్ సెక్రటరీ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఎంవీఎస్. ప్రసాద్, చీఫ్ ఆర్బిటర్ దేవోతమా, కృష్ణ, రవితేజ, పద్మావతి, వినయ్ చేతుల పై బహుమతులు అందుకున్నారు.

తుది ఫలితాలు:- అండర్ - 9 సెలక్షన్. 1, లక్షిత్ గుత్తి. 2, తురుబత్తి నందన్ శ్రీ సాయి నిహాంత్. 1, లాలిత్య నన్నము. 2, ధర్మల రేష్మా రెడ్డి. ఈ నలుగురు క్రీడాకారులను మన జిల్లా నుండి రాష్ట్రానికి పంపిస్తాము అని డాక్టర్ రంగాల బాబురావు. ప్రెసిడెంట్ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ తెలియజేశారు. తుది ఫలితాలు:- డిస్ట్రిక్ట్ ఓపెన్ చెస్ ఛాంపియన్. 1, శ్యామ్ భార్గవ్ గోడ. 2, భాస్కర్ రావు బలగా. 3, అనీష్ షణ్ముఖ సాయి పి. 4, వీర వరప్రసాద్ ఉడతా. 5, పవన్ కుమార్ ఎల్లపు. ఓపెన్ లో గెలిచిన ఛాంపియన్ కి తర్వాత క్రీడాకారులకు నా అభినందనలు డాక్టర్ ఆర్ బాబురావు తెలియజేశారు. స్కూల్ టీచర్స్, ఆర్గనైజర్స్ మరియు పేరెంట్స్ పాల్గొన్నారు. ఎస్. కమలేశ్వరరావు. డైరెక్టర్ మనీ చెస్ అకాడమీ తెలియజేశారు.

## ఘనంగా మరిడిమాంబ అమ్మవారికి సారె ఊరేగింపు





**అనకాపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి 09**: పట్టణం లోని విజయరామరాజుపేటలో మరిడి మాంబ అమ్మవారి ఆలయం 10 వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి భక్తులు సారే సమర్పించారు. విజయరామరాజుపేట చుట్టు పక్కల వీధుల నుండి మహిళలు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు తయారుచేసి ఊరేగింపుగా సారెను అమ్మవారికి సమర్పించారు. గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ, కార్యదర్శి పలకా రాము, ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, ట్రెజరర్ పిట్టబుద్దేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సంవత్సరాల సమస్యకు పరిష్కారం చూపించిన ఎమ్మెల్యే సుందరపు

**ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు.**





**మునగపాక, పెన్ సత్తా, పిబ్రవరి 09:** మండలం లోని టి. శిరసపల్లి గ్రామంలో రూ.309.00 లక్షల యం.డి.ఆర్. ప్లాన్

ప్రభుత్వ నిధులతో తోటాడ బీటి రోడ్డు వయా నాగవరం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే రహదారి చాలా ముఖ్యమని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే రోడ్ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలాగే గ్రామస్తులంతా ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎప్పుడూ చెబుతుంటారన్నారు. అందుకే ఆయన నియోజకవర్గంలో మొట్ట మొదటిగా ఎమ్మెల్యేగా గెలుపొందాకా నియోజకవర్గ వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ చూపించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నక్కపల్లి హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి09:** మండల కేంద్రం నక్కపల్లి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల నిర్వహించారు. సోమవారం నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ సురేష్ రాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఇషాక్ మహ్మద్ ఆప్తమాలజీ,పావని కక్కల ఆప్తమాలజీ అసిస్టెంట్ లు పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం గల విద్యార్థులను గుర్తించి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. విజయ, ఉపాధ్యాయులు పి. శ్రీనివాస్, ఆర్. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ షాకిచ్చిన బంగారం, వెండి భారీగా పెరిగిన రేట్లు



బంగారం వెండి ధరలు గడిచిన పదిరోజుల్లో భారీ హెచ్చుతగ్గులు నమోదు చేశాయి. బంగారం, వెండి ధరల పతనం కంటిన్యూ అవుతుందని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. కొనుగోలుదారులకు మళ్లీ షాకిచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో సోమవారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2240 పెరిగి రూ.1,58,840కి చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.2050 పెరిగి రూ.1,45,600 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1680 పెరిగి రూ.1,19,130కి చేరింది. వెండి కూడా బంగారంతో పోటీగా పెరిగింది. కిలో వెండి ధరపై రూ.15000 పెరగడంతో.. ప్రస్తుత ధర రూ.3,00,000లకు చేరింది. పెరిగిన బంగారం, వెండి ధరలకు జీఎస్టీ, తరుగు అదనంగా ఉంటుంది. ప్రాంతాలను బట్టి ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. కొద్దిరోజుల్లో శుక్రమూఢం ముగిసి పెళ్లిళ్లు ప్రారంభం కానున్నాయి. వరుసగా ధరల పెరుగుదల తర్వాత.. బంగారం, వెండి ధరలు తగ్గుతూ వస్తుండటంతో మరింత తగ్గుతాయని ఎదురుచూస్తున్నవారికి మళ్లీ ఊహించని షాక్ తగులుతోంది. బంగారం జ్యూవెలరీ కొనేటపుడు 22 క్యారెట్లలో వస్తుంది. దానిప్రకారం చూస్తే.. ఫిబ్రవరి 7, 9 తేదీల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.4700 (జీఎస్టీ, తరుగు లేకుండా) పెరిగింది. ఫిబ్రవరి 6న 10 గ్రాముల రేటు రూ.1,40,900 ఉంటే.. నేటికి దాదాపు రూ.5 వేల మేర పెరిగింది. ఇది కొనుగోలుదారులకు లాస్ అనే చెప్పాలి. బంగారం ధర ఇంకా తగ్గుతుందని ఎదురుచూడకుండా ఇప్పుడే కొనుగోలు చేయడం మంచిదని, మార్కెట్లు ఎప్పుడెలా ఉంటాయో అంచనా వేయడం కష్టమని నిపుణులు చెప్తున్నారు.

## గూగుల్ ఉద్యోగుల ఆగ్రహం




గూగుల్ సంస్థలో అంతర్గత అలజడి. అమెరికా ప్రభుత్వ విభాగాలైన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్‌లతో గూగుల్ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు. గూగుల్ సాంకేతికత హింసకు, నిఘాకు, అణచివేతకు సాధనంగా మారుతోందని, ముఖ్యంగా క్లౌడ్, ఏఐ వినియోగం వలసదారులను ట్రాక్ చేయడానికి, సరిహద్దు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలతో ఉన్న అన్ని ఒప్పందాలను బహిర్గతం చేసి, తక్షణమే వాటి నుంచి గూగుల్ వైదొలగాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.కేవలం క్లౌడ్ సేవలే కాకుండా.. గూగుల్ జనరేటివ్ ఏఐ కూడా ప్రభుత్వ విభాగాల సామర్థ్యాన్ని పెంచేందుకు వాడటంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. యూట్యూబ్‌లో ఐసీఈ రిక్రూట్‌మెంట్ ప్రకటనలు రావడం, అలాగే ఇమ్మిగ్రెంట్ల రక్షణ కోసం రూపొందించిన ట్రాకింగ్ యాప్‌లను ప్లే స్టోర్ నుండి తొలగించడం వంటి చర్యలను ఉద్యోగులు తప్పుబట్టారు. ఈ టెక్నాలజీలను రూపొందిస్తున్న ఉద్యోగులుగా.. తమ శ్రమ ఇలాంటి హింసాత్మక పనులకు ఉపయోగపడటం మమ్మల్ని భయపెడుతోందని లేఖలో పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు




2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారిక డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దీని ప్రకారం, అప్పుల ఊబిలో ఉన్న ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐ) మొత్తం రూ. 89,952 కోట్లు, భారతీ గ్రూప్ రూ. 51,091 కోట్లు, టాటా గ్రూప్‌పై రూ. 20,426 కోట్లు, ఎంటీఎన్ఎల్‌పై రూ. 14,462 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై రూ. 1,984 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో వొడాఫోన్ ఐడియాకు చెందిన 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏజీఆర్ బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేశారు. అంటే, చెల్లింపు ప్రక్రియ వాయిదాలో ఉంది. దీనికి సంబంధించి వీఐ బకాయిలను పునఃపరిశీలన కోసం జనవరి 30న టెలికాం విభాగం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ కమిటీలో భారత ప్రభుత్వానికి చెందిన రిటైర్‌మెంట్ కార్యదర్శి స్థాయి అధికారి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నామినేట్ చేసిన ఓ ప్రతినిధి ఉంటారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయమే తుది ఫలితం కానుంది. అందుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే




మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి. కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు. హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇదే 11 శాతం వడ్డీ రేటుకు చూస్తే నెలకు ఈఎంఐ రూ. 16,369 గా ఉండగా.. మొత్తం వడ్డీ రూ. 89,297 చెల్లించాలి. 12 శాతానికి చూస్తే మూడేళ్లలో నెలకు ఈఎంఐ రూ. 16,607 పడుతుంది. మొత్తం వడ్డీ రూ. 97,858 పడుతుంది.

# రష్యా ముడిచమురు దిగుమతులకు బ్రేక్!



గత ఏడాది కాలంగా భారత ఇంధన మార్కెట్‌లో రష్యా గుత్తాధిపత్యం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. 2025 జూన్ నాటికి భారత్‌కు రష్యా నుంచి వచ్చే క్రూడాయిల్ ఇంపోర్ట్స్ రికార్డు స్థాయిలో రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి.ఆ సమయంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 44 శాతంగా నమోదై అగ్రగామిగా నిలిచింది. తక్కువ ధరకు చమురు లభిస్తుండటంతో భారతీయ రిఫైనరీలు రష్యా వైపే మొగ్గు చూపాయి.అయితే, 2025 నవంబర్ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలు మరియు మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు భారత చమురు దిగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చే చమురు రవాణాపై ఉన్న పరిమితులు మరియు లాజిస్టిక్స్ సమస్యల కారణంగా భారతీయ కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దీనివల్ల గతంలో ఉన్న జోరు కాస్తా తగ్గడం ప్రారంభమైంది.తాజా గణాంకాల ప్రకారం, జనవరి 2026 నాటికి రష్యా చమురు వాటా సగానికి సగం పడిపోయి

22 శాతానికి పరిమితమైంది. ప్రస్తుతం రోజువారీ దిగుమతులు 11.6 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయంటే, మార్కెట్‌లో వచ్చిన మార్పు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ పతనం సంభవించడం ఇంధన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులు పెరిగేందుకు దారితీసింది. దిగుమతులు భారీగా తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారత ఇంధన అవసరాల సరఫరాలో రష్యా ఒక కీలక భాగస్వామిగానే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. భవిష్యత్తులో ధరల వ్యత్యాసం మరియు అంతర్జాతీయ పరిణామాలను బట్టి ఈ దిగుమతుల శాతంలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.


# మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 8 కొత్త స్కీమ్స్




ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి హైరిటర్న్ అందుకోవాలని కోరుకుంటున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న క్రమంలో మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లుతున్నారు. అలాగే ఇప్పటికే ఇన్వెస్ట్ చేస్తున్న వారిలోనూ చాలా మంది కొత్త ఫండ్స్ కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి వారందరికీ ఈ వారం పండగే అని చెప్పాలి. ఎందుకంటే ఈ వారం ఏకంగా 8 కొత్త ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. నాలుగు ప్రముఖ అసెంట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ 8 న్యూ ఫండ్ ఆఫర్ తో వస్తున్నాయి. ఈ వారమే సబ్‌స్క్రిప్షన్ మొదలవుతోంది. వారి ఏ స్కీమ్ తేదీలు ఎప్పుడో తెలుసుకుందాం. కొత్తగా వస్తున్న 8 ఫండ్స్‌లో మూడు ఫండ్ ఆఫ్ ఫండ్స్ (డొమెస్టిక్), రెండు థెమాటిక్ ఫండ్స్, ఒక ఈటీఎఫ్, ఒక లో డురేషన్ ఫండ్ ఉన్నాయి. ఫండ్ ఆఫ్ ఫండ్ కేటగిరీలో మీరే అసెట్ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 10వ తేదీన మొదలవుతోంది. ఫిబ్రవరి 23వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అలాగే గ్రో బీఎస్ఈ హాస్పిటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం ఫిబ్రవరి

10న మొదలై ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 9వ తేదీన మొదలై ఫిబ్రవరి 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక థెమాటిక్ ఫండ్ కేటగిరీలో బరోడా బీఎన్‌పీ పరిబాస్ ఈఎస్‌జీ బెస్ట్ ఇన్ క్లాస్ స్ట్రాటజీ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 12వ తేదీన మొదలవుతోంది. ఫిబ్రవరి 26వ తేదీ వరకు సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఇక ఐటీఐ బిజినెస్ సైకిల్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 27వ తేదీ వరకు కొనసాగుతుంది. అలాగే ఇండెక్స్ ఫండ్ కేటగిరీలో గ్రో బీఎస్ఈ హాస్పిలట్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 11న మొదలై ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 9వ తేదీన మొదలై ఫిబ్రవరి 19వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక బజాజ్ ఫిన్‌సర్వ్ లో డ్యూరేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం ఫిబ్రవరి 9వ తేదీనే మొదలవుతోంది. ఫిబ్రవరి 16వ తేదీ వరకు మాత్రమే ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.

# వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు



మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు

సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ.8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం.

పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం తప్పదా..!

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు రోజురోజుకూ జఠిలమవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక నిరసన అణిచివేత, ఇరాన్ అణుకార్యక్రమాన్ని తగ్గించాలని ట్రంప్ ఇరాన్‌పై ఒత్తిడి పెంచారు. స్పందించకపోతే దాడి చేస్తామని కూడా హెచ్చరించారు. అయితే, ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మాట్లాడుతూ.. న్యాయపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ట్రంప్ డిమాండ్లను మాత్రం తాము ఒప్పుకోబోమని ప్రకటించారు. రక్షణ వ్యూహాలు, క్షిపణి వ్యవస్థలు ఎప్పటికీ చర్చల అంశం కావని చెప్పారు. ఇదిలాఉంటే ఇరాన్ ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయిల్ కారణమని మరోసారి ఇరాన్ అధ్యక్షుడు మసౌజ్హె జెష్కియన్ స్పష్టం చేశారు. ట్రంప్, నెతన్యాహు యూరప్‌లో ఆందోళనలను పెంచారని, తద్వారా ప్రజలను రెచ్చ గొడుతున్నారని ఆరోపించారు. ఇరాన్ సైన్యాధ్యక్షుడు అమీర్ హతామి 'గత పన్నెండు రోజుల యుద్ధం తర్వాత దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేశామని, భవిష్యత్ దాడులకు ఇరాన్‌ను దీటుగా సమాధానం చెబుతుందని' మాట్లాడాడు. ఈ అందరి వ్యాఖ్యల్నిబట్టి చూస్తే అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గల్ఫ్‌లో ఇరుకైన ముఖద్వారం హర్మూజ్ జలసంధి. ఇక్కడినుంచే ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు దారి. ఈ జలసంధిలో ఇరాన్, ఒమన్ దేశాలకు ప్రాదేశిక జలాలు ఉన్నప్పటికీ, దీన్ని అన్ని దేశాల నౌకలు ప్రయాణించగల అంతర్జాతీయ జలమార్గంగా పరిగణిస్తారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా ఈ మార్గానికి సమీపంలోనే ఉంది.యుఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు ఇదే చాలా కీలకమైన ప్రాంతం. ఇదే హర్మూజ్ జలసంధిలో ఇటీవల రెండు రోజుల లైవ్-ఫైర్ నావికా విన్యాసాలను ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌కు దగ్గరగా అమెరికా యుద్ధనౌకలు మోహరింపు, అమెరికా అధ్యక్షుడి హెచ్చరికల ప్రకటనలు యుద్ధానికి కాలుదువ్వినట్టుగానే కనిపిస్తున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలు లక్ష్యంగా అమెరికా దాడి చేయొచ్చు! ఇరాన్, దాని ప్రాక్సీలు(హౌతీలు, హమాస్ సంస్థలు) అమెరికా స్థావరాలు, మిత్రదేశాలైన ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై ప్రతీకార దాడులుచేసే అవకాశాలూ లేకపోలేదు. ఇరాన్ గనక హార్మూజ్ జలసంధిని మూసివేస్తే ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం ఏర్పడటమే కాదు, ప్రాంతీయ అస్థిరత నెలకొంటుంది. అది ప్రపంచంపై తీవ్ర ఆర్థికపరమైన ప్రభావం పడుతుంది. ఇంధన ధరల భారీ పెరుగుదల (ముడి చమురు), స్టాక్ మార్కెట్ల పతనం, హార్మూజ్ జలసంధిలో వాణిజ్య అంతరాయం కలిగించవచ్చు. చమురు, గ్యాస్ ఎగుమతులకు తీవ్ర ఆటంకం ఎదురుకావచ్చు. పశ్చిమాసియాలో అస్థిరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి, ప్రపంచ ఆహార, రవాణా రంగాలు దెబ్బతింటాయని నివేకలు హెచ్చరిస్తున్నాయి. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధాన్ని ఆపేందుకు మిడిల్ ఈస్ట్ దేశాలు గట్టిగానే కృషిచేస్తున్నాయని స్థానిక కథనాల సమాచారం. ప్రత్యక్ష చర్చలు లేనప్పటికీ ఖతార్, తుర్కియేతో సహా ఇతర మధ్యవర్తులుగా చర్చలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఏం జరగనుందో వేచిచూడాల్సిందే!

# ఆరోగ్యానికి అమృతం లాంటి పండు



సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. మనం సపోటాను సాధారణ పండుగానే తీసుకుంటాం. కానీ, సపోటా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. పోషకాలతో నిండిన ఈ పండు మనకు చాలా సులభంగా దొరుకుతుంది. దుకాణాల్లోనే కాదు, చాలా ఇళ్లలో కూడా ఇది సాధారణంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు. సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. వారానికి కనీసం మూడు సార్లు సపోటా తినడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.కంటి సమస్యలు ఉన్నవారికి సపోటా మంచి ఆహారంగా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ం కంటి చూపును మెరుగుపరుస్తుంది. అదేవిధంగా, విటమిన్ ఇ చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మెరిసేలా ఉండేందుకు సపోటా తోడ్పడుతుంది. సపోటాలో విటమిన్ అ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ అలసట, నీరసం అనుభవించే వారికి ఇది మంచి శక్తినిచ్చే పండు. రోజూ సపోటా తినడం వల్ల శరీరం ఉత్సాహంగా ఉంటుంది. నిపుణుల సూచనల

ప్రకారం, రోజుకు 1 నుంచి 2 మధ్యతరహా సపోటాలు తినవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో, వైద్యుల సలహాతో సపోటాను తీసుకోవచ్చు. మొత్తానికి, తక్కువ ఖర్చుతో సులభంగా లభించే సపోటా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, మీ రోజువారీ ఆహారంలో ఈ పోషక విలువల పండును తప్పక చేర్చుకోండి.

# తరచుగా తుమ్ములు వస్తున్నాయా?




రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. కొందరు ఒకేసారి అనేకసార్లు తుమ్ములు తుమ్ముతుంటారు. దీంతో వారిలో "నాకు రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గిపోయిందా?" అనే సందేహం చాలామందిలో కలుగుతుంది. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? నిపుణులు ఏమంటున్నారు? పూర్తి వివరాలు తెలుసుకుందాం. తుమ్ము అనేది మన శరీరంలోని ఒక సహజ రక్షణ చర్య. ముక్కులోకి దుమ్ము, అలెర్జీ కారకాలు, బ్యాక్టీరియా లేదా వైరస్‌లు ప్రవేశించినప్పుడు, వాటిని బయటకు పంపడానికి శరీరం తుమ్ము ద్వారా స్పందిస్తుంది. అంటే, తుమ్మడం అనేది శరీరం పనిచేస్తున్న సంకేతమే తప్ప, తప్పనిసరిగా బలహీనతకు గుర్తు కాదు. 1. అలెర్జీలు.. ఇదే అత్యంత సాధారణ కారణం. దుమ్ము, పుప్పొడి (పోలెన్), పెంపుడు జంతువుల వెంట్రుకలు, చలి గాలి, ఇవన్నీ తుమ్ములను ప్రేరేపిస్తాయి. 2. వాతావరణ మార్పులు.. ఒక్కసారిగా చలి నుంచి వేడికి లేదా వేడి నుంచి చలికి మారితే ముక్కులోని నరాలు స్పందించి తుమ్ములు వస్తాయి. 3. సైనసైటిస్ లేదా ముక్కు సమస్యలు.. సైనస్ ఇన్‌ఫెక్షన్, ముక్కులో వాపు ఉండటం వల్ల కూడా తుమ్ములు ఎక్కువవుతాయి. 4. వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. జలుబు, ఫ్లూ మొదలైనవి ఉన్నప్పుడు తుమ్ములు సహజం. 5. కాలుష్యం, రసాయన వాసనలు.. పెర్ఫ్యూమ్స్, సిగరెట్ పొగ, కెమికల్స్ కూడా తుమ్ములకు కారణం కావచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.

. ఇది కొంతవరకు నిజమే. తరచూ తుమ్మడం అనేది ఎక్కువగా అలెర్జీ లేదా పర్యావరణ కారణాల వల్లే జరుగుతుంది. బలహీనమైన ఇమ్యూనిటీ ఉన్నవారికి సాధారణంగా.. తరచూ జలుబులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా రావడం, గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడటం, నిరంతర అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.కేవలం తుమ్ములే ఉన్నాయంటే అది ఇమ్యూనిటీ తక్కువగా ఉందని చెప్పలేం. కానీ, తరచుగా తుమ్మడం, పునరావృత జలుబు, గొంతు నొప్పి, అలసట లేదా తరచుగా అనారోగ్యాలు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతాలు. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, శరీరం బాహ్య అలెర్జీ కారకాలు, వైరస్లతో సమర్థవంతంగా పోరాడలేకపోతుంది. అందువల్ల, లక్షణాలు పదేపదే సంభవిస్తాయి.

### గార్డెన్‌లో ఉండే ఈ కూరగాయతో..

# క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు!



ముఖ్యంగా క్యాన్సర్ సమస్యతో ఎంతో మంది బాధ పడుతున్నారు. దీని కోసం వేలకు వేలు పెట్టి మందులను వాడుతుంటారు. కానీ, వాటి కన్నా మన గార్డెన్ లో ఉండే వాటితోనే ఈ ప్రాణాంతక సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఈ మధ్య కాలంలో అందరూ ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా గడుపుతున్నారు. అయితే, ఇదే సమయంలో సమయానికి ఫుడ్ కూడా సరిగా తినలేకపోతున్నారు. దీని వలన అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. మన అందరి పెరట్లో పచ్చిమిర్చి మొక్క ఉంటుంది. అయితే, కొందరు దీనిని పక్కన పెట్టేస్తారు. మరి కొందరు అన్ని కూరల్లో వేసుకుని తింటారు. అయితే, సరైన విధంగా తీసుకుంటే ఇది మనకీ ఎంతో మేలు చేస్తుంది.పచ్చిమిర్చిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాలు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్ ను పెంచి అనారోగ్య సమస్యలు రాకుండా చేస్తాయి. జలుబు, దగ్గుతో ఇబ్బంది పడే వారికీ ఇది ఎంతో మేలు చేస్తుంది.అంతేకాదు, ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను కూడా తొలగిస్తుంది. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలు కూడా రాకుండా ఉంటాయని నిపుణులు కూడా చెబుతున్నారు. ఈ మిర్చిలో ఉండే ఫైబర్ తిన్న ఫుడ్ ను జీర్ణం చేస్తుంది. అలాగే, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా రావు. ఇది అన్ని కూరగాయల్లో చిన్నది కానీ, దాని లాభాలను చూసి అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే మీరు వైద్యున్ని సంప్రదించి తీసుకోవడం మంచిది.ఛ

# పసుపులో ఆ రెండు కలిపితేనే అది పవర్ ఫుల్



పసుపును మనం సహజమైన యాంటీబయాటిక్ అని, గొప్ప యాంటీ ఇన్ఫ్లమేటరీ అని నమ్ముతాం. కానీ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పూజా రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మనం పసుపును విడిగా తీసుకుంటే అందులోని ప్రయోజనాలు శరీరానికి 1% కూడా అందవు. పసుపులోని ప్రధాన సమ్మేళనమైన 'కర్కుమిన్'ను గ్రహించే శక్తి మన శరీరానికి చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. మనం పసుపు తిన్న వెంటనే మన కాలేయం (ఒతిలవతీ) దానిని రక్తంలోకి చేరకముందే విచ్ఛిన్నం చేసి బయటకు పంపిస్తుంది. పసుపు తన పూర్తి స్థాయి ప్రభావాన్ని చూపించాలంటే దానికి తోడుగా కొన్ని పదార్థాలు అవసరమని సైన్స్ చెబుతోంది. డాక్టర్ పూజా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పసుపు గ్రహణశక్తిని పెంచే మార్గాలను వివరించారు. మన అమ్మమ్మల కాలం నాటి పసుపు, మిరియాల పొడి నెయ్యి కాంబినేషన్ వెనుక ఉన్న అసలు రహస్యం ఇప్పుడు ఆధునిక వైద్య పరిశోధనల్లో కూడా నిరూపితమైంది. కేవలం ఒక చిటికెడు మిరియాల పొడి చేర్చడం వల్ల పసుపు పనితీరు 20 రెట్లు పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం. మిరియాల పొడి : పసుపును మిరియాల పొడితో కలిపి తీసుకుంటే, శరీరంలో దాని గ్రహణశక్తి ఏకంగా 100 శాతం పెరుగుతుంది. మిరియాల్లో ఉండే 'పైపెరిన్' అనే పదార్థం, లివర్ కర్కుమిన్‌ను విచ్ఛిన్నం చేయకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల పసుపు నేరుగా రక్తంలోకి ప్రవేశిస్తుంది. కొవ్వు పదార్థాలు : కర్కుమిన్ నీటిలో కరగదు, కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతుంది. కాబట్టి పసుపును నెయ్యి లేదా కొబ్బరి నూనె వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే అది శరీరానికి అందుతుంది.ప్రాచీన విజ్ఞానం: అందుకే మన పెద్దలు పసుపును కూరల్లో నూనెతో వేయించడం లేదా పాలలో నెయ్యి, మిరియాల పొడి వేసి ఇచ్చేవారు. ఈ మూడు కలిసినప్పుడు అది ఒక శక్తివంతమైన ఔషధంగా మారుతుంది. ఇకపై పసుపు పాలు తాగినా లేదా కూరల్లో వాడినా, అందులో ఒక చిటికెడు మిరియాల పొడి కొద్దిగా నెయ్యి ఉండేలా చూసుకోండి.

# బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు..
# విరాట్, రోహిత్‌లకు షాక్

**2025-26 సీజన్‌కు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల ప్రకటన**
**విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను గ్రేడ్ 'బీ'కి పరిమితం చేసిన బోర్డు**
**కెప్టెన్ శుభ్‌మన్ గిల్, బుమ్రా, జడేజా అగ్రశ్రేణి గ్రేడ్‌లో కొనసాగింపు**
**కేవలం వన్డేలకే పరిమితం కావడంతో సీనియర్ల గ్రేడ్ తగ్గింపు**
**టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా గ్రేడ్ 'బీ'లోనే**



బీసీసీఐ 2025-26 సీజన్‌కు సంబంధించిన వార్షిక ఆటగాళ్ల కాంట్రాక్టుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈ కొత్త జాబితాలో టీమిండియా సీనియర్ స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ 'బీ'కి పడిపోవడం సంచలనంగా మారింది. ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అగ్రశ్రేణి గ్రేడ్‌లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి వైదొలగి కేవలం వన్డే క్రికెట్‌కు మాత్రమే పరిమితమైన కారణంగా కోహ్లీ, రోహిత్‌లను గ్రేడ్ 'బీ'కి మార్చినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే వేదికగా జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించారు.గత ఏడాది గ్రేడ్ 'ఏ'కి ప్రమోషన్ పొందిన ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఈసారి కూడా బుమ్రా, జడేజాలతో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు, కోహ్లీ, రోహిత్‌లతో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ సహా మొత్తం 11 మంది ఆటగాళ్లు గ్రేడ్ 'బీ'లో ఉన్నారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ 2026 జరుగుతున్న సమయంలో బీసీసీఐ ఈ కాంట్రాక్టులను ప్రకటించడం గమనార్హం. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్, ఇప్పటికే తన తొలి మ్యాచ్‌లో యూఎస్ఏపై విజయం సాధించింది.

# భారత్‌తో ఆడతాం

## ప్రకటించిన పాకిస్థాన్
## బహిష్కరణపై వెనక్కి



లాహోర్: సంక్షోభానికి తెరపడింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ షెడ్యూలు ప్రకారమే జరగనుంది. ఆ మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొంది. భారత్, పాక్ మ్యాచ్ ఈ నెల 15న కొలంబోలో జరగనుంది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ), ఐసీసీ మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పునరాలోచించాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని కోరాయి. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు తాను విజ్ఞప్తి చేసినట్లు బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ చెప్పాడు. శ్రీలంక ప్రధాని అనుర కుమార కూడా పాక్ ప్రధాని షరీఫ్‌తో ఫోన్లో మాట్లాడారని పాక్ ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు పాకిస్థాన్, భారత్, బంగ్లాదేశ్‌లతో ముక్కోణపు సిరీస్‌ను నిర్వహించాలన్న పీసీబీ డిమాండ్‌ను ఐసీసీ తిరస్కరించింది. ప్రపంచకప్‌నకు దూరం కావడంతో బంగ్లాకు కలిగిన ఆర్థిక నష్టాన్ని పూడ్చేందుకు పీసీబీ ఈ ప్రతిపాదన చేసింది. భారత్‌తో ద్వైపాక్షిక క్రికెట్ పునరుద్ధరణకు కూడా పీసీబీ డిమాండ్ చేసింది. కానీ అది ఐసీసీ చేతుల్లో లేని విషయం. అయితే వచ్చే అండర్-19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను బంగ్లాకు కట్టబెట్టే అవకాశాన్ని ఐసీసీ పరిశీలించే అవకాశముంది. భారత్‌లో టీ20 ప్రపంచకప్ ఆడేందుకు తిరస్కరించినందుకు బంగ్లాదేశ్‌పై ఎలాంటి ఆంక్షలు విధించబోమని ఐసీసీ స్పష్టం చేసింది.

# తారక్ 'డ్రాగన్'.. నీల్ ప్లాన్ చేంజ్ చేశారా?





డైరెక్టర్ ప్రశాంత్ నీల్.. ఆయన పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది డార్క్ టోన్, బ్లాక్ అండ్ గ్రే షేడ్ విజువల్స్. ఎందుకంటే కేజీఎఫ్, సలార్ వంటి చిత్రాలతో ఆయన స్పెషల్ విజువల్ స్టైల్ ను సెట్ చేశారు. అయితే ఇప్పుడు తన స్టైల్ కు భిన్నంగా, కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.
జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ మూవీ కంప్లీట్ గా కలర్ ఫుల్ ట్రీట్ తో రాబోతుందనే టాక్ వినిపిస్తోంది.
ఇప్పటివరకు ప్రశాంత్ నీల్ సినిమాల్లో మాస్ యాక్షన్ తో పాటు డార్క్ ఫ్రేమ్స్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. దీంతో ఎన్టీఆర్ తో చేసే మూవీ కూడా అదే తరహాలో ఉంటుందని అంతా భావించారు. కానీ ఈసారి నీల్ తన సిగ్నేచర్ స్టైల్ కు బ్రేక్ ఇస్తూ, ఫుల్ కలర్ ప్యాలెట్ లో సినిమాను రూపొందిస్తున్నారని సమాచారం. బ్లాక్, గ్రే షేడ్స్ కనిపించకుండా.. విజువల్స్ పరంగా ఫ్రెష్ లుక్ ఇవ్వాలనే ప్లాన్ లో ఉన్నట్టు తెలుస్తోంది.
అయితే హై వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా మూవీ రూపొందుతుండగా.. యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన సెట్స్, భారీ స్కేల్ ఫైట్స్ ప్రేక్షకులను అలరించనున్నాయని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. అంతే కాదు.. ఎన్టీఆర్ కెరీర్ లోనే బెస్ట్ యాక్షన్ ఫిల్మ్ గా నిలిచేలా ప్రశాంత్ నీల్ స్పెషల్ కేర్ తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది.ఇక సినిమాలో ఎన్టీఆర్ ను ప్రశాంత్ నీల్ ప్రజెంట్ తీరు హైలైట్ కానుందని వినికిడి. రోల్ కోసం తారక్ ప్రత్యేకంగా.. ఎంతో డెడికేషన్ తో చాలా వెయిట్ తగ్గి స్లిమ్ లుక్ లో కనిపించనున్నారు. ఇప్పటికే ఆయన మేకోవర్ చూసి అభిమానులు, సినీ ప్రియులు షాక్ అయ్యారు. కానీ మూవీలో మాత్రం తారక్ క్యారక్టరైజేషన్ మరింత స్టైలిష్ గా, పవర్ ఫుల్ గా ఉంటుందని టాక్.ఇక సినిమా విషయానికొస్తే.. పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న డ్రాగన్ లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనుండగా, మాలీవుడ్ స్టార్ టోవినో థామస్ కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాయి.నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాదిలోనే సినిమా రిలీజ్ కానుండగా.. కేజీఎఫ్, సలార్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో డ్రాగన్ పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మరి డార్క్ స్టైల్ కు బ్రేక్ ఇచ్చి కలర్ ఫుల్ టేకింగ్ తో రాబోతున్న డ్రాగన్ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com